## ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలి

**జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్**



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జనవరి 12 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎన్.శంకర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి కార్యాలయంలో జిల్లాలోని ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహిస్తున్న అన్ని మేనేజ్‌మెంట్ల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తెలుగు అకాడమీ పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. అకాడమీ పుస్తకాలు చదివే విద్యార్థులే పోటీ పరీక్షల్లో రాణిస్తారని తెలిపారు. బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, ప్రింటర్, కంప్యూటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

## 17 నుంచి 'డైట్'లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వికారాబాద్, జనవరి 12 : ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డైట్ 2023-25 రెండు ఏండ్ల కోర్సుల్లో చేరడానికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామాచారి శుక్రవారం తెలిపారు. వారికి మరోసారి జనవరి 17న డైట్ కాలేజీ వికారాబాద్‌లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. 18 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 25న సీట్లు కేటాయిస్తారని, 26 నుంచి 29 వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాట్మెంట్ లెటర్‌తోపాటు కేటాయించిన కళాశాలలో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు.

## నేడు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

వికారాబాద్, జనవరి 12 : వికారాబాద్ జిల్లాలోని పత్తి మిల్లుల్లో అధిక మొత్తంలో పత్తి వస్తున్నందున కొనుగోలు చేయుటకు కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, సీసీఐ అభ్యర్థన మేరకు జనవరి 13న వికారాబాద్ జిల్లాలోని అన్ని మిల్లుల్లో పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెట్ అధికారి సారంగపాణి శుక్రవారం తెలిపారు. ఆదివారం, సోమవారం, మంగళవారం సంక్రాంతి సెలవులు ఉన్నాయన్నారు. తిరిగి పత్తి కొనుగోలు కేంద్రాలను 17న యథావిధిగా కొనసాగించనున్నట్లు తెలిపారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్



గ్రంథాలయ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, జనవరి 12 : వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం 32 మంది గ్రంథాలయ సంస్థ చైర్మన్లను తొలగించిన సందర్భంగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ సెక్రటరీ సురేశ్‌తో గ్రంథాలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వారి వెంట డిప్యూటీ లైబ్రేరియన్ కిషన్, సిబ్బంది ఉన్నారు.

## వరి సాగుపై మెళకువలు పాటించాలి

**జిల్లా వ్యవసాయాధికారి డా.గోపాల్**



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి డా.గోపాల్

కొడంగల్, జనవరి 12 : వరి సాగుపై మెళకువలపై రైతులకు అవగాహన ఉంటేనే అధిక దిగుబడులు తీయవచ్చని జిల్లా వ్యవసాయాధికారి డా.గోపాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్ద నందిగామ గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వరి పంటను పరిశీలించి సాగులో పాటించాల్సిన మెళకువలను రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఈవో పావని ఉన్నారు.

# చెంచుల జీవనోపాధికి కృషి

- ప్రతి లబ్ధిదారుడు, కుటుంబానికి సంక్షేమ ఫలాలు, వసతుల కల్పన
- ఈ నెల 15న అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలి
- సంక్రాంతి పండుగను సెలవుదినంగా భావించకూడదు
- ఆయా శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సమీక్షా సమావేశం

**ఈ నెల 15న చైతన్యనగర్‌లో పీఎం జన్‌మన్ కార్యక్రమం**



మౌలిక వసతులపై చైతన్యనగర్ గ్రామస్తులను అడిగి తెలుసుకొంటున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పెద్దేముల్, జనవరి 12 : చెంచు జాతి ప్రజల జీవనోపాధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఈ నెల 15న 'పీఎం జన్‌మన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చైతన్యనగర్ గ్రామంలో అధికారులతో కలిసి మౌలిక వసతుల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజలనుద్దేశించి మాట్లాడే కార్యక్రమంలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చైతన్యనగర్ గ్రామంలో ప్రతి వ్యక్తి, కుటుంబానికి ఆధార్‌కార్డు, విద్యుత్, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, జన్‌ధన్ అకౌంట్లు, బ్యాంకు ఖాతాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆయుష్మాన్ కార్డులతో పాటు తదితర మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. ఎవరైనా మిగిలి ఉంటే వారికి సైతం అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంక్రాంతి పండుగను సెలవు దినంగా భావించకుండా పని చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఇందిరా, డీటీడీడబ్ల్యూవో కోటాజీ, ఎల్‌డీఎం రాంబాబు, ఈడీఎం మహమూద్ అలీ, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలితాకుమారి, డీఏవో గోపాల్, తహసీల్దార్ కె.కిషన్, ఆర్ఐ రాజురెడ్డి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ వీరేశం, పంచాయతీ కార్యదర్శి నాగరాణి, సర్పంచ్ పి.లలిత, డాక్టర్ బుచ్చిబాబు, లోన్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ప్రమోద్‌కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య పాల్గొన్నారు.



మండలంలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

## గిరిజన హాస్టల్‌లో పీఎం జన్‌మన్ మీటింగ్

- కడ్తాల్ పట్టణంలోని గిరిజన హాస్టల్‌లో 15న చెంచు కుటుంబాలతో ప్రధాని వర్చువల్ సమావేశం
- ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని చెంచులంతా వచ్చేలా చూడాలని అధికారులకు ఆదేశం

కడ్తాల్, జనవరి 12 : పీఎం జన్‌మన్ ఆదివాసీ న్యాయ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశంలోని చెంచులతో సమావేశం నిర్వహించనున్నారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లోని చెంచు కుటుంబాలతో పీఎం నిర్వహించే వర్చువల్ మీటింగ్ కోసం, కడ్తాల్ పట్టణంలోని గిరిజన హాస్టల్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ వర్చువల్ సమావేశం ఏర్పాట్లను పరిశీలించారు. వర్చువల్ మీటింగ్‌కు రెండు మండలాల్లోని చెంచులంతా వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మీటింగ్‌కు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల పరిధిలోని చెంచు సంఘాల నాయకులతో ప్రధాని సమావేశంపై ఆమె చర్చించారు. ఆమె వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి పద్మ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరీదేవి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సీడీపీవో సుక్కుబాయి, ఎంపీవో మధుసూదనాచారి, ఏవో శ్రీలత, పీఆర్ ఏఈ పరమేశ్, వార్డెన్ రాములు ఉన్నారు.

## క్రీడల్లో రాణిస్తున్న గురుకుల విద్యార్థులు


**గురుకుల విద్యా సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ శారద**




బహుమతులను అందుకుంటున్న చేవెళ్ల గురుకుల విద్యార్థినులు

మొయినాబాద్, జనవరి 12 : పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు క్రీడల్లోనూ గురుకుల విద్యార్థులు రాణిస్తున్నారని గురుకుల విద్యా సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ శారద అన్నారు. మూడు రోజులుగా ఘట్‌కేసర్ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఇగ్నైట్ ఫెస్ట్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ క్రీడల్లో రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలలకు చెందిన 1600 మంది విద్యార్థినులు పాల్గొనగా, తోలుకట్టా గ్రామ సమీపంలోని చేవెళ్ల గురకుల బాలికల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభను చూపారు. శుక్రవారం చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల 8వ తరగతి విద్యార్థిని మణిదీప్తి స్పెల్-బీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7500 నగదు బహుమతిని అందుకున్నది. ఆరో తరగతి కె.సాహితీ తృతీయ స్థానంలో నిలిచి రూ.5000 నగదు బహుమతిని దక్కించుకున్నది. ముఖాముఖ(డిబెట్) పోటీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న అశ్రిత తృతీయ స్థానంలో నిలిచి రూ.5000 నగదు బహుమతిని పొందింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ పని చేయాలి




కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్‌కు హార్ట్‌ఫుల్‌నెస్ చేంజ్ మేకర్ అవార్డు అందజేస్తున్న కమలేశ్ పటేల్

- హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్
- కన్హాలో యూత్ యునైటెడ్ వేడుకలు
- కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్‌కు హార్ట్‌ఫుల్‌నెస్ చేంజ్ మేకర్ అవార్డు

నందిగామ,జనవరి12 : ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ కలిసి పని చేయాలని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్హాశాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఎస్సే ఈవెంట్ భాగస్వామ్యంతో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్‌కు హార్ట్‌ఫుల్‌నెస్ చేంజ్ మేకర్ అవార్డును హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లడుతూ కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ మానవత్వంతో గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సేవకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. యూత్ యునైటెడ్ కార్యక్రమంలో వివిధ దేశాల యువతను ఒకే వేదికపై చేర్చి ప్రపంచ శాంతికి మార్గదర్శకాలను వివరించారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు దేశాల నుంచి ప్రముఖులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## పల్లెల్లో డూడూ బసవన్నల సందడి

పెద్దఅంబర్‌పేట, జనవరి 12: సంక్రాంతి పండుగ వచ్చేస్తుండటంతో ఊర్లల్లో గంగిరెద్దుల సందడి మొదలైంది. డూడూ బసవన్న అంటూ సన్నాయి వాయిస్తూ గ్రామాల్లో తిరుగుతున్నారు. 'అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు' అంటూ గంగిరెద్దులను ఆడిస్తున్నారు. ఇండ్ల యజమానులు ఇచ్చే మొత్తాలను తీసుకుని బసవన్నలతో ఆశీర్వాదం ఇప్పిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో గంగిరెద్దులు ఇలా కనిపించాయి.



## పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

**స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి స్మితాసబర్వాల్‌కు వినతిపత్రం సమర్పించిన మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్**



రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి స్మితాసబర్వాల్‌కు వినతిపత్రం ఇస్తున్న కులకచర్ల మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్

కులకచర్ల, జనవరి 12 : గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ నిధులను విడుదల చేయాలని కులకచర్ల మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జఠావత్ శంకర్‌నాయక్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి స్మితాసబర్వాల్‌కు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చాంబర్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెండు ఏండ్లుగా కరోనా వల్ల పల్లె ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక అభివృద్ధి పనులు చేయలేకపోయామని తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి

**డీఈవో సుశీందర్‌రావు**

తుర్కయంజాల్, జనవరి 12 : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వార్షిక స్పోర్ట్స్ డే సంబురాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఖేలోత్సవ్ 1.0 కార్యక్రమానికి శుక్రవారం డీఈవో సుశీందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనను తిలకించి అభినంధించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం డైరెక్టర్ రాఘవరెడ్డి, సుధీర్, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



ఖేలోత్సవ్‌లో మాట్లాడుతున్న రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు



# నాటుకోడి..లాభసాటి..

- గ్రామాల్లో విరివిగా నాటుకోళ్ల పెంపకం..
- స్వయం ఉపాధి పొందుతున్న యువకులు
- సంక్రాంతి పండుగపూట నాటుకోళ్లకు ఫుల్ డిమాండ్



ఫారంలో పెరుగుతున్న నాటుకోళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 12 : నాటుకోడి పెంపకందారులు లాభాలను ఆర్జిస్తున్నారు. సహజ సిద్ధంగా పెరుగడం.. పుష్కలమైన పోషకాలు ఉండడంతో వాటి మాంసానికి భలే గిరాకీ ఉన్నది. ముఖ్యంగా సెలవు దినాలు, పండుగ వేళల్లో మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తున్నది. సంక్రాంతి పండుగ సందర్భంగా నాటుకోళ్లకు గిరాకీ ఫుల్.. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మాంసం ప్రియులు మటన్‌కు బదులుగా నాటుకోడి కూరను ఆరగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పల్లెలోని పలువురు నిరుద్యోగ యువకులు నాటుకోళ్ల పెంపకాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. బాయిలర్ కోళ్ల పెంపకంతో పోల్చితే రిస్క్ తక్కువ.. మందులు సైతం అంతగా వాడాల్సిన అవసరం లేదు. సహజసిద్ధంగా ఇండ్ల మధ్య.. పెరట్లో పెంచుకోవచ్చు. అయితే, ఇటీవల చాలామంది షెడ్లలోనూ నాటుకోళ్లను పెంచుతున్నారు. నాటు కోడి కూర అంటే ఇష్టపడని వారుండరు. మామూలు రోజుల్లో కిలో కోడి రూ.300, కిలో కోడి పుంజు రూ.400ల వరకు పలుకుతున్నది. కానీ, సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో నాటుకోళ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ఒక్క కోడిపెట్ట కిలో రూ.500, పుంజులు కిలో రూ.700 వరకు ధర పలుకుతున్నది.

### ఆరోగ్యానికి ఎంతో మంచిది..

బాయిలర్ కోళ్లతో పోల్చితే నాటుకోడి మాంసం ఆరోగ్యానికి మంచిదని ప్రజల నమ్మకం. ఎందుకంటే ఈ కోళ్లు సహజ సిద్ధమైన ఆహారాన్ని తీసుకోవడం, మాంసం రుచిగా ఉండడంతో తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. మేక, గొర్రెల మాంసంలో కొవ్వు ఎక్కువగా ఉండడంతో వాటికి ప్రత్యామ్నాయంగా నాటుకోడి మాంసాన్ని ఆరగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా నాటుకోడి మాంసం కోసం బారులుదీరుతున్నారు. డబ్బులు ఎక్కువైనా చెల్లించడానికి వెనుకాడడం లేదు.

### భలే క్రేజీ..

ఒకప్పుడు గ్రామీణులు ఇంటింటా కోళ్లను పెంచుకునేవాళ్లు. చుట్టాలు వచ్చినా, పండుగలు వచ్చినా ఇంటిలో పెంచుకున్న నాటుకోడి కూర వండేవారు. మారిన జీవనశైలితోపాటు కోళ్ల పెంపకం, వాసన తదితర ఇబ్బందులతో పల్లె ప్రజలు వీటి పెంపకాన్ని తగ్గించారు. ఈ క్రమంలో బ్రాయిలర్ కోళ్లు రావడం, ప్రతి ఊరిలోనూ చికెన్ సెంటర్లు ఏర్పాటు కావడంతో ప్రజలు ఈ చికెన్‌కే మొగ్గు చూపుతున్నారు. బాయిలర్ చికెన్ ఎప్పుడంటే అప్పుడు దొరుకుతుండడంతో ప్రజలు నాటుకోడిని మరిచిపోయారు. కరోనా వైరస్ ప్రభావంతో ప్రజలు నాటుకోడి వైపు మొగ్గు చూపారు. ప్రోటీన్లు ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్న వైద్యుల సూచన మేరకు నాటుకోడి మాంసానికి గిరాకీ పెరిగింది.

## నరదిష్టి పేరు చెప్పి..

**లోకల్ చానల్స్‌లో పెయిడ్ ప్రచారం**

# ₹17 లక్షలు గుంజిండు

- సమస్యలు తొలగిస్తానంటూ..
- జ్యోతిష్యం పేరుతో వ్యాపారం

**అరెస్టు చేసి, 14 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు**



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిచైతన్య

చార్మినార్, జనవరి 12 : అమాయకుల నమ్మకమే ఆదాయంగా మార్చుకున్నాడు. తన శక్తులతో అన్నీ అనుకూలంగా మారుస్తానంటూ జ్యోతిష్యం పేరుతో మోసం చేస్తున్న ఓ మాయగాడిని దక్షిణ తూర్పు, ఛత్రినాక పోలీసులు అరెస్టు చేశారు. దక్షిణ మండల డీసీపీ సాయి చైతన్య తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన సిరిగిరి మంజునాథ అలియాస్ బ్రహ్మ, అలియాస్ అర్జున్‌రాజు, అలియాస్ మంజు (39) వేర్వేరు పేర్లతో చలమణి అవుతున్నాడు. కరీమాబాద్‌లో ప్రత్యేకంగా దుర్గా, సమ్మక్క సారలమ్మ జ్యోతిశ్యాలయం పేర్లతో స్థానికంగా వ్యాపారం ప్రారంభించాడు. పలు ప్రైవేట్ లోకల్ టీవీ చానళ్లలో భారీగా ప్రకటనలిచ్చి.. గొప్పగా ప్రచారం చేసుకున్నాడు. ప్రకటనలు చూసిన పలువురు అతడిని సంప్రదించడంతో భారీగా డబ్బులు గుంజి.. మోసం చేశాడు. టీవీలో వచ్చిన అతడి ప్రకటన చూసిన పాతబస్తీకి చెందిన శ్రీకాంత్‌రెడ్డి కూడా మోసపోయాడు. శ్రీకాంత్‌రెడ్డి తల్లి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. కొన్ని కష్టాలు కూడా ఉన్నాయి. దీంతో కరీమాబాద్‌కు వెళ్లి మంజునాథను కలిశాడు. హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి నవంబర్ నాలుగో తేదీన ఆహ్వానించారు. ఇల్లు మొత్తం కలియతిరిగి నరదిష్టి ఉన్నదని చెప్పాడు. శాంతి పూజలు చేయాలనగా అడిగినంత డబ్బు ఇస్తూ వచ్చాడు. ఇప్పటి వరకు రూ. 17 లక్షలు ఇచ్చాడు. అయినా తల్లి ఆరోగ్యం నయం కాలేదు. దీంతో బాధితులు ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. మంజునాథను అరెస్టు చేసి రూ. 14.65 లక్షలు రికవరీ చేశారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ నర్సింహారావు, అదనపు డీసీపీ జహంగీర్, ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్లు సైద బాబు, బోజ్య తదితరులు పాల్గొన్నారు.